**చర్చల పునరుద్ధరణ కోసం కృషి చేద్దాం**

# ప్రభుత్వానికీ నక్సలైట్లకూ మధ్య

పీపుల్స్‌వార్‌కూ రాష్ట్ర ప్రభుత్వానికీ మధ్య చర్చలు మొదలయినట్టే మొదలయి అంతలోనే నిలిచిపోవడం రాష్ట్రంలో అధిక భాగం ప్రజలకు నిరాశ కలిగించింది.

ఈ పరిణామానికి ప్రధానంగా ప్రభుత్వాన్నే తప్పు పట్టాలనడానికి తటపటాయించవలసిన పనిలేదు.

మనిషికయినా ప్రభుత్వానికయినా ఒకే నాలుక ఉండాలి. పది నాలుకలు పెట్టుకుని ఒక్కొక్కసారి ఒక్కొక్క నాలుకతో మాట్లాడితే ఎదుటివారికి సంభాషించడం అసాధ్యం అవుతుంది. సంభాషణే అసాధ్యమయితే ఇంక చర్చలెట్లా జరుగుతాయి?

'ఎప్పుడయినా ఎక్కడయినా మాట్లాడటానికి మేము సిద్ధమే'నని ఈ ప్రభుత్వమే ఒకనాడు అనలేదా? చర్చల 'విధివిధానాలు' నిర్ణయించడం కోసమని చెప్పి పీపుల్స్‌వార్ పంపించిన ప్రతినిధులతో మూడు దఫాలు మాట్లాడలేదా? కాల్పుల విరమణ పాటిస్తారా లేదా అన్న విషయంలో తేడాలు వచ్చాయిగానీ చర్చలు జరిపే విషయంలో రాలేదు కదా? కాల్పుల విరమణ విషయంలో ప్రభుత్వం ఏ హామీ ఇవ్వకపోయినప్పటికీ జులై 20 నాటికి చర్చలకు వస్తామని పీపుల్స్‌వార్ ప్రకటించింది. ప్రభుత్వం ఆ ప్రకటనకు సాదరంగా స్పందించినట్టే అనిపించింది.

మూడు వారాల తరువాత ముఖ్యమంత్రి 'ఆయుధాలు పట్టుకొని చర్చలంటే ఎట్లా?' అంటున్నారు. ప్రజలు పిచ్చివాళ్లని చంద్రబాబు అనుకుంటున్నాడా, లేకపోతే అతని ప్రభుత్వానికి మతి చెడిందని ప్రజలనుకోవాలా? ఈ మాట మొదట్లోనే అంటే 'విధి విధానాల' ప్రహసనం నడిచేదే కాదుకదా? 'పీపుల్స్‌వార్‌తో చర్చలకు సిద్ధమే'నని ప్రకటించినప్పుడు ఆయుధాలు దించేస్తే చర్చలకు సిద్ధమని ప్రభుత్వం చెప్పదలచుకుందని అనుకోవాలా? వాళ్లంతట వాళ్లు ఆయుధాలు దించేస్తే ఇహ వారితో ప్రభుత్వం చర్చించేది ఏమిటి? పాకిస్తాన్ పిఒకెని అప్పగించేస్తే తప్ప ఆ దేశంతో మాట్లాడకూడదని బాల్‌థాకరే, బలరాజ్ మథోక్ వంటి హిందుత్వవాదులు అంటుంటారు. వాళ్లను విజ్ఞతగల వాళ్లుగా ఎవరూ ఎప్పుడూ భావించలేదుగానీ, తెలివయిన వ్యవహర్తగా పేరు తెచ్చుకోవాలని ఉబలాటపడే మన ముఖ్యమంత్రి అదే స్థాయిలో మాట్లాడితే ఎట్లా?

ఈ చర్చల ప్రస్తావన ఎప్పుడు మొదలయిందో, ఎందుకు మొదలయిందో ఒకసారి జ్ఞాపకం చేసుకోవడం ఉచితంగా ఉంటుంది. అప్పుడు తప్ప చర్చల ఆవశ్యకతా అర్థంకాదు, ప్రభుత్వం ఎంత అర్థరహితంగా మాట్లాడుతున్నదో కూడ అర్థంకాదు.

నక్సలైట్ ఉద్యమం మొదలయి ముప్పై ఏళ్లు దాటింది. పేదరికం సమస్యనూ, గ్రామీణ ప్రాంతాలలోనూ ఏజెన్సీ ప్రాంతాలలోనూ శతాబ్దాలుగా స్థిరపడిపోయి ఉన్న అణచివేత సమస్యనూ ఆ ఉద్యమం రాజకీయ అజెండా మీదికి తెచ్చింది. వాటి పరిష్కారానికి తాను కొంతమేరకు తోడ్పడింది, ప్రభుత్వ వైఫల్యాన్ని చర్చకు పెట్టింది, ప్రజలకు కొంత బలాన్ని ఇచ్చింది, అంతకు మించి ఆశించే సాహసం అందిచ్చింది.

అయితే ఈ పనులన్నీ చేయడానికి నక్సలైట్ ఉద్యమం ఎంచుకున్న సాయుధ పోరాట మార్గం, దానిని ఎదుర్కొనే పేరు మీద ప్రభుత్వం ఆ ఉద్యమం పైననేకాక దానిని ఆదరించిన ప్రజలందరిపైనా ప్రయోగించిన హింసాత్మక నిర్బంధం, ఆ నిర్బంధాన్ని తిప్పికొట్టడానికి నక్సలైట్లు ప్రయోగించిన ఎదురుదాడి, దానిని ఎదుర్కొనడానికి ప్రభుత్వం మరింతగా పెంచిన అణచివేత... ... ...

ఈ వలయం దొంతరలు దొంతరలుగా పెరుగుతూ పోయింది. ప్రజల సమస్యలు పూర్తిగా పక్కకు పోకపోయినప్పటికీ, నక్సలైట్లకూ రాజ్యానికీ మధ్య పోరాటం కేంద్రస్థానాన్ని ఆక్రమించుకుంది. ఆ పోరాటం జరుగుతున్న ప్రాంతాలలో బతుకుతున్న ప్రజలు భయం నీడలో బతకసాగారు. ఆ ప్రజలు ప్రభుత్వాన్నీ 'అన్నల'నూ ఒకేరకంగా చూడకపోయినప్పటికీ, ప్రభుత్వం కంటే 'అన్నల' మీదనే ఎక్కువ మందికి ఎక్కువ అభిమానం ఉన్నప్పటికీ, ఇద్దరి మధ్య జరుగుతున్న పోరులో ప్రజలు నలిగిపోసాగారన్నది వాస్తవం.

సరిగ్గా ఈ నేపథ్యంలోనే పౌరస్పందన వేదిక ఏర్పడింది. మీరేం చేస్తున్నారో కొంచెం ఆలోచించండి అని ఇరుపక్షాలనూ నిలదీసింది. వారి మీద సమాజంలో ఉన్న విమర్శను వారికి వినిపించి జవాబు కోరింది. ఆ విమర్శనూ జవాబునూ పుస్తకాలుగా అచ్చువేసి ప్రజలలో ప్రచారం చేసింది.

ఈ క్రమంలోనే, ప్రభుత్వానికీ నక్సలైట్లకూ మధ్య చర్చలు జరగాలి అన్న ప్రతిపాదన ముందుకు వచ్చింది. చర్చల ఆవశ్యకతను ఈ నేపథ్యంలోనే అర్థం చేసుకోవడం ఉచితంగా ఉంటుంది. చర్చల అజెండా రూపురేఖలను కూడా ఈ నేపథ్యమే నిర్ణయించడం ఉచితంగా ఉంటుంది. ముప్పై ఏళ్లు చర్య ప్రతి చర్యలుగా పెరుగుతున్న హింసావలయాన్ని, ఆ

వలయంలో బతుకుతున్న ప్రజల మీద దాని ఫలితంగా పడుతున్న ఒత్తిడిని వీలయిన మేరకు తగ్గించడం చర్చల లక్ష్యంగా ఉండాలి. ఆ హింసావలయానికి ఎవరు ఏమేరకు బాధ్యులన్న వివాదంతో నిమిత్తం లేకుండ ఈ ప్రయత్నం జరగడం అవసరం అన్నది పౌరస్పందన వేదిక ప్రతిపాదన సారాంశం. నక్సలైట్లు పనిచేస్తున్న ప్రాంతాలలో బతుకుతున్న ప్రజలలో అత్యధికులు దీనినే కోరుకుంటారని నిస్సందేహంగా చెప్పవచ్చు. అందులో నక్సలైట్ రాజకీయాలను అభిమానించే వారూ ఉన్నారు, వ్యతిరేకించే వారూ ఉన్నారు, తటస్థంగా ఉండేవారూ ఉన్నారు.

చర్చలకు కూర్చునే ముందు ఈ లక్ష్యాన్ని నిర్దిష్టమైన అజెండాలో బిగించవలసిన అవసరం ఉంటుంది. ఆ వివరాలలోకి ఇప్పుడు పోనక్కరలేదుగానీ కొన్నిటిని సూచించడం ఉచితంగా ఉంటుంది. నక్సలైట్లను పట్టియ్యమని పోలీసులు ప్రజలను హింసించడం మానుకోవాలి, నక్సలైట్ రాజకీయాలను అభిమానించడం, ఆదరించడం నేరమన్నట్టు వ్యవహరించడం మానుకోవాలి, ఎవరు ఏ హక్కుల గురించి మాట్లాడినా ఉద్యమించినా నక్సలైట్లతో సంబంధాలు అంటగట్టి సతాయించడం మానుకోవాలి. అటువైపు నక్సలైట్లు ప్రజల రాజకీయ స్వేచ్ఛను గౌరవించాలి, ప్రభుత్వ విధానాలకు ప్రతీకారంగా కిందిస్థాయి పాలక పార్టీ ప్రతినిధులపైన, ఉద్యోగుల పైన దాడులు చేయడం మానుకోవాలి, ప్రజావసరాలతో ముడిపడి ఉన్న ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం మానుకోవాలి.

ఇవీ ఇటువంటివీ చర్చల అజెండాలోని అంశాలు కాగలవు. ఇటువంటి అజెండాను రూపొందించుకొని, చర్చలు ముగిసేదాకా ఇరుపక్షాలూ కాల్పుల విరమణ పాటించడానికి ఒప్పుకొని, చర్చలకు వచ్చే పీపుల్స్‌వార్ ప్రతినిధులకు ప్రభుత్వం 'సేఫ్ పాసేజ్' ఇచ్చేటట్టయితే చర్చలు జరగగలవు.

ఇదెందుకు సాధ్యంకాలేదు? 'విధి విధానాల' చర్చలోనే ఇవన్నీ జరిగిపోవలసింది. కానీ జరగలేదు. 'సేఫ్ పాసేజ్' ఇస్తామని ప్రభుత్వం ఒప్పుకునింది గానీ కాల్పుల విరమణకు ఒప్పుకోలేదు. అజెండా అసలే నిర్ణయం కాలేదు. అజెండా విషయంలో ఒక నిర్ణయానికి రాలేకపోవడానికి ఇద్దరినీ తప్పుపట్టవచ్చునేమో గానీ, కాల్పుల విరమణకు ఒప్పుకోకపోవడం ప్రభుత్వ వైఖరిలోని ప్రధాన లోపం. ఒకపక్క ప్రతిరోజూ ఎదుటివారు తమ సహచరులను చంపుతుంటే, వారితో కూర్చొని మర్యాదపూర్వకంగా మాట్లాడడం వారికైనా వీరికైనా సాధ్యం కాదుకదా? తమకైనా సాధ్యమవుతుందని తెలుగుదేశం పాలకులు అనుకుంటున్నారా?

రాజకీయంగా ఆలోచిస్తే ఈ ప్రశ్నకు కాదు, లేదనే జవాబు రాగలదు. కానీ ఇక్కడ 'పోలీసు దృష్టి' ప్రధానంగా పనిచేసిందనేది స్పష్టమే. పోలీసులు పెట్టిన ఒత్తిడి వల్ల ఇది జరిగిందా, లేక రాజకీయ పాలకులే 'పోలీసు దృష్టి'తో చూస్తున్నారా అనేది ఇక్కడ అప్రస్తుతం. ఆ దృష్టితో చర్చల ప్రక్రియను చూడడం తప్పని మాత్రం నిర్ద్వంద్వంగా ప్రకటించాలి.

చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిననాటి నుండి నక్సలైట్ ఉద్యమంపైన పోలీసుల ఇనపబూట్ల అణచివేత చాలా పెరిగింది. సంవత్సరానికి 200 మందికి పైగా ఎన్‌కౌంటర్లలో చనిపోతున్నారు. అంటే ప్రతీ మూడు రోజులకూ ఇద్దరని అర్థం. దీనివల్ల నక్సలైట్ ఉద్యమాన్ని బాగా వెనక్కి నెట్టగలిగామనీ, ఇప్పుడు రెండు నెలలో మూడు నెలలో చర్చల పేరిట విరమణ ఇచ్చినట్టయితే నక్సలైట్లు మళ్లీ 'విజృంభిస్తారనీ' పోలీసు దృష్టి భావిస్తుంది. అది పోలీసు దృష్టికి అపచారంగా తోచవచ్చునుగానీ, రాజకీయంగా చూసినప్పుడు అందులో అవాంఛనీయం ఏముంది? చర్చల ఫలితంగా కానివ్వండి, చర్చల విషయంలో వచ్చిన ప్రజాభిప్రాయపు ఒత్తిడి ఫలితంగా కానివ్వండి, నక్సలైట్ పార్టీలు నిర్విచక్షణమైన హింసను అదుపు చేసుకునేటట్టయితే, వాళ్లు రాజకీయంగా 'విజృంభించడం' అవాంఛనీయం ఎందుకు కావాలి? తెలుగుదేశం దృష్టికి కావచ్చునుగానీ ప్రజాస్వామిక దృష్టికి కాదు.

దురదృష్టమేమిటంటే, ముప్పై ఏళ్లుగా మన రాష్ట్రంలో నక్సలైట్ ఉద్యమం విషయంలో పోలీసుల అణచివేత వ్యూహమే ప్రభుత్వం పాలనా వ్యూహంగా ఉంది. దీనివల్ల ఇప్పటికే ప్రజలకు – అందులో అట్టడుగు వర్గాల ప్రజలకు – చాలా నష్టం జరిగింది. పౌర స్పందన వేదిక చొరవ ఫలితంగానైనా ఈ దుస్థితి పోయి ప్రభుత్వం ఒక అర్థవంతమైన పాలనా వ్యూహాన్ని అనుసరిస్తుందేమోనని ఆశిస్తే అది జరగలేదు. తిరిగి పోలీసుల అణచివేత వ్యూహం నిర్దేశించే ప్రమాణాలే ప్రభుత్వానికి ప్రామాణికం అయ్యాయి. అందుకే జరిగినదంతా మరచిపోయి, 'ఆయుధాలు పట్టుకొని చర్చలంటే ఎట్లా?' అని ముఖ్యమంత్రి అనగలిగాడు. ఆయన ఆ మాట అనేదాకా పోలీసులు పూటకిద్దరిని హతమార్చి ఒత్తిడి పెట్టారు.

'పోలీసు దృష్టి' మరొకసారి గెలిచింది. కానీ ఓడిపోయింది నక్సలైట్లు కాదు; ప్రజలు, ప్రజావసరాలు. అందుకే పౌరస్పందన వేదిక మొదలుపెట్టిన ప్రయత్నం విఫలం కావడానికి వీలులేదంటున్నాము. చర్చల ప్రక్రియ అర్థవంతంగా తిరిగి మొదలు పెట్టవలసిందిగా ప్రభుత్వం పైన ఒత్తిడి పెట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాము.

మానవహక్కుల వేదిక

7 ఆగస్టు 2002

**Human Rights Forum**